కబ్జా కోరల్లో కళాశాల జాగా

ప్రభుత్వ కళాశాల స్థలం ఆక్రమించిన టీడీపీ నాయకుడు

- ఏకంగా మట్టి రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో విద్యార్థులు


పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో నిర్మించిన మట్టి రోడ్డు

పిడుగురాళ్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందుతుంది. ఇదే కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల నిర్మిస్తే బాగుంటుందని విద్యార్థులంతా ఎదురు చూస్తున్నారు. ఇటువంటి తరుణంలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 20 అడుగుల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాడు. సదరు టీడీపీ నాయకుడికి కళాశాల స్థలం వెనుక సుమారు రూ. 4 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ప్లాట్లుగా ఏర్పాటు చేస్తే రూ.కోట్లు గడించే ఆలోచనలో ఉన్నాడు. దీనికి ప్రధానంగా దారి అవసరం. అద్దంకి నార్కెట్‌పల్లి హైవే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుకొని ఉండటంతో ఏకంగా కళాశాల స్థలంలోనే మట్టి రోడ్డు నిర్మాణానికి పూనుకున్నాడు.

భావితరాలకు అన్యాయం....

పిడుగురాళ్ల పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రమే ఉంది. విశాల ప్రాంగణం కలిగిన ఈ కళాశాలలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తే భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే కళాశాల ప్రాంగణంపై ఎప్పటినుంచో కన్నేసిన సదరు టీడీపీ నేత అదనుకోసం ఎదురుచూస్తూ, తాము అధికారంలోకి రావడమే ఆలస్యం అన్నట్లుగా కబ్జాకు దిగి, అడ్డంగా రోడ్డు వేసేశాడు.

ఆందోళనలో విద్యార్థులు...

తమ కళాశాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని, పల్నాడు జిల్లా కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్‌డీఓ, తహసీల్దార్ దృష్టికి కళాశాల విద్యార్థులు తీసుకొని వెళ్లారు. ఇటీవలే పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా కూడా నిర్వహించారు.


కళాశాల పూర్తి స్థలం 9.54 ఎకరాలు..

1950లో పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థాపించారు. అప్పట్లో 9.54 ఎకరాల్లో ప్రభుత్వం కేటాయించింది. అందులో కొంత స్థలంలో కళాశాల భవనం నిర్మించారు. అందులో కళాశాల ప్రాంగణం విశాలంగా ఉండటంతో 2018లో ప్రభుత్వ జూనియర్ కోర్టుతోపాటు, పలు ప్రభుత్వ కారాలయాల నిర్మాణం కోసం రూ. 6.1 సెంట్లను కేటాయించారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణానికి నోచుకోలేదు. ప్రభుత్వం 3.53 ఎకరాలు ప్రభుత్వ జూనియర్ కళాశాల నిమిత్తం ఉంచారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకపోవటంతో కళాశాల ప్రాంగణం విశాలంగా కనిపించటంతో టీడీపీ నాయకులు వారికి అనుకూలంగా స్థలాన్ని మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇటువంటి ఆక్రమణలను అడ్డుకొని, సత్వరమే నిలుపుదల చేయాలని జూనియర్ కళాశాల విద్యార్థులు, పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు నిర్మాణం ఆపాలంటూ ధర్నా చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు (ఫైల్)

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



కళాశాల ప్రాంగణంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈవిషయాన్ని ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లాము. ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మిస్తే ఇటువంటి ఆక్రమణలు జరగవు. ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలి తప్ప ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించటం సరికాదు.

– బీవీ కృష్ణారెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, పిడుగురాళ్ల

రహదారిని పరిశీలిస్తాం



పిడుగురాళ్ల పట్టణంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో రోడ్డును నిర్మిస్తున్నారని, కళాశాల విద్యార్థులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవం. ఈ విషయాన్ని గురజాల ఆర్‌డీఓ దృష్టికి తీసుకొని వెళ్లటం జరిగింది. ఈస్థలాన్ని ఆర్‌డీఓ, నేను స్వయంగా వెళ్లి స్థలాన్ని పరిశీలిస్తాం, ఆ తర్వాత ప్రభుత్వ పరమైన నిర్ణయం తీసుకోవటం జరుగుతుంది.

– ఎం.మధుబాబు, తహసీల్దార్, పిడుగురాళ్ల

క్లుప్తంగా

దేవదాయశాఖ ఈఓగా రామిరెడ్డి బాధ్యతల స్వీకారం



రెంటచింతల: రెంటచింతల మండల దేవదాయశాఖ ఈఓగా గాదె రామిరెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఫిరంగాపురం ఈఓగా విధులు నిర్వహిస్తున్న రామిరెడ్డిని రెంటచింతలకు బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఈఓగా పని చేసిన బుర్రి నెమలిరెడ్డి దాచేపల్లి ఈఓగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భక్తుల మనోభావాల మేరకు అర్చకుల సహకారంతో సేవలు అందజేస్తానన్నారు.

నేడు కారెంపూడిలో ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

కారెంపూడి: కారెంపూడి మండలంలో ఆదివారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటసన్నెగండ్ల గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, అలాగే కారెంపూడిలో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, కారెంపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల అదనపు తరగతి గదుల నూతన భవన ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరం నరమాలపాడు గ్రామంలో ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి నాగిరెడ్డి, పరిటాల రవీంద్ర విగ్రహాల ప్రతిష్టలో ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

ఉచిత వైద్యశిబిరం



దాచేపల్లి: మండలంలోని పెదగార్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అస్టార్ రమేష్ హస్పిటల్ సహకారంతో చెట్టినాడ్ సిమెంట్ యజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గుండె, కీళ్ల, నరాల నొప్పులకు సంబంధించిన వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేసి వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లతో పాటుగా ఫ్యాక్టరీ హెచ్ ఆర్ హెడ్ బీవీఆర్ రాజు, మేనేజర్ షేక్ అన్వర్ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ రాజీనామా చేయాలి

దాచేపల్లి: భారత రాజ్యాంగానికి విఘాతం కలిగించేలా మాట్లాడిన డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ తన పదవికి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి కరాలపాటి జానీ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ అదే రాజ్యాంగంలోని లౌకిక వాదాన్ని విమర్శించటం సరికాదన్నారు. సనాతన ధర్మం పేరుతో పక్కాగా ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను పవన్‌కల్యాణ్ మోస్తున్నారని, సనాతన ధర్మం పేరుతో లౌకిక వాదానికి తూట్లు పొడుస్తున్నారని ఆయన ఆరోపించారు. కులం, మతం, ప్రాంతీయత అసమానతలు లేని నవ సమాజం కోసం పాటుపడదామని పవన్‌కల్యాణ్ చెప్పి ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్, సంఘపరివార్ ఉచ్చులో పడ్డారని ఆయన విమర్శించారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కల్యాణ్ మతతత్వవాదిగా వ్యవహరించటం మంచి పద్ధతి కాదని, తన వైఖరి మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముద్ర రుణాల మంజూరు

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులైన వారికి రూ. 10 లక్షల వరకు ముద్ర రుణాలు మంజూరు చేస్తామని ఎస్‌బీఐ శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజర్ వలేటి ప్రసాద్ తెలిపారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో శనివారం డిపాజిట్స్ చేసిన ఖాతాదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ. 2 కోట్ల ముద్ర రుణాల్ని మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలోని మతుకుమల్లిలో అగ్రి డెయిరీ పాడి గేదెల యూనిట్స్ 10 మందికి రూ. 80 లక్షలు, శానంపూడి, పోట్లూరు గ్రామాల్లో 10 మందికి రూ. 80 లక్షల రుణాలను అందజేశామని చెప్పారు.

క్రీడలతో విశేష గుర్తింపు

చిలకలూరిపేట: క్రీడలతో గుర్తింపు లభిస్తుందని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏలూరు జిల్లా పెదవేగిలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు అండర్–19 బాలురు, బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించింది. బాలుర జట్టులో ఏఎంజీ పదో తరగతి విద్యార్థులు చరణ్, డేనిక్, బాలికల విభాగంలో స్వాతి, లక్ష్మీప్రియ ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహించడంతో వారిని అభినందించారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..



మాచర్ల: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని న్యూట్రన్స్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాసరెడ్డి పాల్గొనగా, ప్రిన్సిపాల్ కుర్రిసాయి మార్కెండేయరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యసనాల జోలికి పోకుండా ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, కుర్రి శివనాగిరెడ్డి, జూలకంటి పోలురెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, కళాశాల డైరెక్టర్లు పఠాన్ నాగూర్‌వలి, ఎం.మహేశ్వరరెడ్డి, జాని, కె.భువనేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పలు రంగాల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

హక్కుల పరిరక్షణ మండలి గౌరవ చైర్మన్‌గా ఏసురత్నం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన కోట ఏసురత్నం బాబు ఎస్సీ, ఎస్టీ, హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మండలి రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా రాజారావు నుంచి శనివారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏసురత్నం బాబు 2026 డిసెంబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.

ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా అప్పలరాజు


అప్పలరాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో శ్రీ కనకదుర్గా ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికను శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారి బి.రాజేష్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా మైలపల్లి అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా ఎరిపల్లి నరసింహులు, కార్యదర్శిగా చెల్లూరి దేవుడు, కార్యవర్గ సభ్యులుగా చేపల భూలోక, చోడిపల్లి సింహాద్రి, యజ్జల అప్పారావు, చేపల బంగారు చిట్టి, సురాడా నాగేశ్వరరావు, చెల్లూరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు నియామక పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం సంజీవరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు మత్యకారుల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా పర్యవేక్షణలో విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాతే అన్నపూర్ణేశ్వరీ..!


దాచేపల్లిలో అన్నపూర్ణదేవిగా వీర్ల అంకమ్మతల్లి


పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి


పిడుగురాళ్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కుంకుమ పూజలు


రెంటచింతలలో గాయత్రీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


సత్రశాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భ్రమరాంబికాదేవి


కారెంపూడిలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అంకాలమ్మ


చెన్నాయపాలెంలో అన్నపూర్ణ దేవిగా రేణుకా అమ్మవారు


మల్లేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీదేవిగా..

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గ్రామగ్రామాన పలు దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అమ్మవార్లను పలు రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో కొలువైన అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

– దాచేపల్లి/పిడుగురాళ్ల/రెంటచింతల/కారెంపూడి/మాచవరం

నగర పంచాయతీ కార్మికుల మెరుపు సమ్మె

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్


నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

దాచేపల్లి: నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు శనివారం మెరుపు సమ్మెకి దిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా పలువురు కార్మికులను విధుల నుంచి తొలగించటంతో కార్మికులందరూ విధులను బహిష్కరించి సమ్మెకి దిగి, నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ ఎంపీ అప్పారావుని కలిసి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తమను విధుల్లోకి తీసుకోకపోవటం వలన కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తమకు అన్యాయం చేయవద్దని వేడుకొన్నారు. పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అప్పారావు చెప్పారు. తొలగించిన కార్మికులకు సీఐటీయూ నాయకులు అండగా నిలిచారు. సీఐటీయూ నాయకుడు ఆంజనేయరాజు మాట్లాడుతూ... గత 40 రోజుల క్రితం రాజకీయ కక్షసాధింపుల కోసం పలువురు కార్మికులను విధుల నుంచి అన్యాయంగా తొలగించారని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని నగర పంచాయతీ అధికారులను కోరినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి నాయకులు చెప్పినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే సమ్మె తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సంఘం నాయకుడు షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ పరిహారమివ్వాలి


చావపాడు రైతులతో మాట్లాడుతున్న రాధాకృష్ణ

అమరావతి: మండల పరిధిలోని యండ్రాయి, చావపాడు, పెదమద్దూరు, వైకుంఠపుర , అమరావతి, నరుకుళ్ళపాడు గ్రామాల్లో శనివారం కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ నష్టపోయిన భూములను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వరదల్లో పంట నష్టపోయిన రైతుల అందరి వివరాలు పరిహారానికి నమోదుచేయలేదన్నారు. సచివాలయంలో వ్యవసాయ సహాయకుడు కేవలం వాగు పక్కనున్న భూములను మాత్రమే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నమోదు చేయడం, అది కూడా ఎక్కువ ఎకరాలు నష్టపోయినా రైతు పేరుపై రెండుమూడు ఎకరాలను మాత్రమే నమోదు చేస్తున్నారన్నారు. సొంత భూమికి మాత్రమే పరిహారం ఇచ్చి, కౌలు భూములను నమోదు చేయడం లేదని చెప్పారు. వైకుంఠపురంలో 1950లో సొసైటీగా ఏర్పాటు చేసి ఇచ్చిన భూమిని ఒక్కొక్కరికి 1.27ఎకరాల చొప్పున 68 మందికి డీకే పట్టాలు ఇచ్చారన్నారు. మొత్తం 86 ఎకరాల భూమిని రైతులు సాగుచేస్తున్నారన్నారు. ఈ భూములలో సాగు చేస్తున్న పంటతు దెబ్బ తిన్నా నమోదు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. అక్టోబరు 8 విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరిగే కౌలు రైతు సదస్సుకు తరలి రావాలని కోరారు. సీఐటీయూ కార్యదర్శి బి.సూరిబాబు, సీపీఎం సభ్యుడు రాజు ఉన్నారు.

సందడిగా దసరా ఉత్సవాలు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నరసరావుపేట రూరల్: ఏఎమ్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలు, రంగవల్లులు, బతుకమ్మలతో కళాశాలలో దసరా పండుగ శోభ ఉట్టి పడింది. బతుకమ్మ ఆటలతో విద్యార్థినులు, అధ్యాపకులు సందడి చేశారు. అనంతరం నిర్వహించిన దాండియా నృత్యంలో సంప్రదాయ దుస్తులతో అధ్యాపకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన మహిషాసుర మర్దిని నృత్యరూపకం ఆకట్టుకుంది.

కార్యక్రమాలకు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఉత్సవాల వల్ల సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహనతో పాటు సామూహిక చైతన్యాన్ని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ భూషణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యడ్లపాడు ఎంఈఓపై క్రమశిక్షణ చర్యలు

నాదెండ్ల: నాడు–నేడు పనుల్లో జరిగిన అవకతవకలపై యడ్లపాడు ఎంఈఓ–2 అరుణకుమారిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలోని శారదా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో అరుణ్‌కుమారి హెచ్‌ఎంగా పని చేశారు. అప్పట్లో నాడు–నేడు పనుల్లో రూ.10,99,350ల విలువైన చెక్కును థర్డ్‌పార్టీ అయిన ఎస్. సుజాతకు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. ఇసుకను స్థానికంగా పెద్ద మొత్తంలో కొనుగోలుచేసి అధికారులకు వేబిల్లులు సమర్పించలేదు. గ్రానైట్ బండల కొనుగోలులో కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ ఆమెను గతేడాది డిసెంబర్ 21న సస్పెండ్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరిస్తూ ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం ఫిబ్రవరి 7న విధుల్లోకి అనుమతించారు. అయితే, ఈ వ్యవహారంపై నరసరావుపేట డెప్యూటీ డీఈవోను ఎంక్వైరీ అధికారిగా నియమించారు. విచారణలో ఆమెపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రెండు మేజర్ ఇంక్రిమెంట్లను నిలుపుదల చేసినట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా మార్ట్‌ల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు



నరసరావుపేట రూరల్: మహిళా మార్ట్‌ల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.అమలకుమారి తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని మహిళా మార్ట్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ మహిళా మార్ట్‌ల్లో సహజ ఉత్పత్తులతో పాటు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రజలు కూడా మార్ట్‌ల్లో లభించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ప్రకృతి వ్యవసాయ స్టాల్‌లో ఉత్పత్తులు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో భాను, ఎస్‌ఎఫ్‌ఏ భాను, మేరి పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఎం.శివకుమారి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువులు వాడటం వల్ల ఆరోగ్యంతో పాటుగా పర్యావరణానికి హాని తగ్గించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతుల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పత్తిలో గులాబీ రంగు ఉధృతిని లింగాకర్షక బుట్టలు వాడటం వల్ల తగ్గించుకోవచ్చన్నారు. మరో శాస్త్రవేత్త పి.ప్రవీణ్‌కుమార్ నేలలో సేంద్రియ కర్బన్ శాతాన్ని పెంచుకోవడం వల్ల గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించుకోవచ్చన్నారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త వెంకట్రాములు మాట్లాడుతూ వరిలో కొత్త వంగడాలు మినీకిట్‌ల గురించి వివరించారు. జేజీఎల్‌కి ప్రత్యామ్నాయంగా కొత్త వంగడాలు వచ్చాయని రైతులు సాగు చేయాలన్నారు. బీపీటీ 6082 రకం చిరు సంచులు రైతు జెట్టి నాగమల్లేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ కె.ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

నేడు శరీర, నేత్ర దానంపై అవగాహన సదస్సు

నరసరావుపేట: స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో శరీర, నేత్ర దానం అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అమ్మనేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘ పల్నాడు, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్ ఎస్.చలపతిరావు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొని శరీర, నేత్ర దానం దిశగా ఆలోచన చేయాలని ఆయన సూచించారు.